క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు భాస్కర్‌రాజు మృతి


భాస్కర్‌రాజు (ఫైల్)

పుత్తూరు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు(70) సోమవారం మృతి చెందారు. ఈయన ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులుగా, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు. ఈయన మృతి పట్ల అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన స్వగ్రామం పుత్తూరు మండలం ఒంటిమిట్ట గ్రామంలో మంగళవారం 11 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన బంధువులు తెలియజేశారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమ, విబూధితో పాటు నారికేళ జలాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి, చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేక పూజలు చేపట్టారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: వేరుశనగ పంటలకు ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. సోమవారం మండలంలోని నింద్ర, మిట్టూరు గ్రామల్లో వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేరుశెనగ పంటకు ఆశించిన పచ్చపురుగు, లద్దెపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ విజయకుమార్

కార్వేటినగరం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ ఎం.వి జయకుమార్ అన్నారు. సోమవారం స్థానిక శ్రీలక్ష్మీనరసింహా విద్యాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచిన్ టెండూల్కర్, హుస్సేన్ బోల్ట్ ఉన్నత విద్యను అభ్యసించక పోయినా వారు ఎంచుకున్న రాణించి అంతర్జాతీయస్థాయికి ఎదిగారన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ నరసింహా కళాశాల డైరెక్టర్లు దిలీప్‌కుమార్, వెంకటేష్, ధనంజయరెడ్డి, పురుషోత్తం, రమణ, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మహేశ్వరరాజు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జమున, ఏఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పలాయగుంట వెంకన్నకు వెండి ఆభరణం


వెండి ఆభరణం అందజేస్తున్న దాతలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం అప్పలాయగుంట గ్రామంలో వెలసిన శ్రీఅభయ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి వెండి ఆభరణం బహూకరించారు. సోమవారం వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన టీటీడీ రిటైర్డ్ ఉద్యోగి రాధాకృష్ణారెడ్డి, సరస్వతమ్మ దంపతులు రూ.2 లక్షల 34 వేల విలువైన కూడిన 2.1/4 కేజీల బరువున్న వెండి కంఠ ఆభరణాన్ని సమర్పించారు. వారికి ఆలయ ప్రధానార్చకులు వేదమంత్రాల నడుమ ఆశీర్వదించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

పరీక్ష సామగ్రి వితరణ


విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ చేస్తున్న జై భీమ్ ఫౌండేషన్ సభ్యులు

కార్వేటినగరం: జై భీమ్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. సోమవారం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జై భీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో బెస్టాఫ్ లక్ కిట్‌ను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించి పేద విద్యార్థులకు అండగా నిలిచిన జైభీమ్ ఫౌండేషన్‌కు అభినందనలు అన్నారు. అనంతరం జై భీమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఎంఈఓ-2 మనోజ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగోద్భవం.. మహోద్భుతం

నూతన శివపార్వతుల పంచలోహ విగ్రహాలు


ప్రకృతి సోయగాలను నింపుకొన్న మూలకోన(పెద్దతీర్థం కోన) మహాశివ రాత్రికి ముస్తాబైంది. ప్రకృతి రమణీయత ఉట్టిపడే సహజ జలపాతం వద్ద కొలువైన శ్రీపార్వతీ సమేత శ్రీసంఘమేశ్వరస్వామి దర్శనార్థం మహాశివరాత్రి నాడు భక్తులు పోటెత్తుతారు. రేపటి మహాశివరాత్రి రోజున ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల పంచలోహ ఉత్సవమూర్తులను ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటుతో భక్తుల తాకిడి మరింత పెరిగే అవకాశం ఉంది. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


కోనలో నిరంతర జలధార

- రేపే మహాశివరాత్రి
- ఏడాది పొడవునా నిరంతంర జలధార
- కొండపై కొలువైన సంఘమేశ్వరస్వామి
- స్వామి అమ్మవార్ల పంచలోహ విగ్రహాలు ప్రత్యేకం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు

పుత్తూరు: పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలోని మూలకోనగా పిలవబడే పెద్దతీర్థంకోన పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఎత్తైన కొండలు, ఆకాశాన్ని అంటే వృక్షాలు, ఆ వృక్షాలపై నుంచి వీనులవిందుగా పక్షుల కిలకిలలు, చల్లటి గాలి, నేలను తాకని సూర్యరశ్మి, ఎత్తైన బండరాళ్ల మధ్య నిరంతరం జాలువారే జలపాతం, సహజ సిద్ధంగా ఏర్పడిన కోనేరుతో కూడిన అందాలు ఇక్కడ కొలువై ఉన్నాయి. ఎత్తైన కొండ రాళ్ల మధ్యన నిరంతరం జాలువారే నీరు, ఎంతటి కరువు కాలంలోనైనా ఏడాది పొడవునా నిరంతర జలధార ప్రవాహం ఇక్కడి దైవత్వానికి ప్రతీక అని ప్రజల ప్రగాఢ విశ్వాసం. మడుగులోని నీటి అడుగున ఉన్న మట్టి, రాళ్లు, చిన్న చిన్న చేపపిల్లలు సైతం స్పష్టంగా కనిపించడం కూడా స్వచ్ఛత కూడా దైవీకంగా గోచరిస్తుంది. దీంతో ఈ మూలకోనను అద్దాల కోనగా కూడా పిలుస్తుంటారు. దశాబ్దాల నాటి ఈ పెద్దతీర్థంకోన అటవీ ప్రాంతంలో ఓ మూలగా ఉండడంతో కాలక్రమంలో మూలకోనగా పిలువబడుతోంది. అనునిత్యం మనస్సును ఆహ్లాదపరిచే ఈ ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రతి సెలవు రోజుల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇక్కడి తరలివస్తుంటారు.

కోర్కెలు తీర్చే శ్రీసంఘమేశ్వరస్వామి


మూలకోన కొండపై శ్రీపార్వతీ సమేత శ్రీసంఘమేశ్వరస్వామి కొలువై ఉండగా, కోనేరుకు ఎదురుగా శ్రీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కొలువుండడం మరో ప్రత్యేకత. జలపాతంలో స్నానమాచరించి, భక్తి ప్రపత్తులతో సంఘమేశ్వరస్వామిని పూజిస్తే కోర్కెలు తీరుతాయని ప్రతీతి. ఏటా మహాశివరాత్రి రోజున ఆలయ కమిటీ కార్యక్రమాలు చూసేందుకు రాష్ట్ర ప్రజలతో పాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివస్తుంటారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని కోనేరులో నిర్వహించే తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తుతారు. పెద్ద ఎత్తున అన్నదానం, పండరీ భజనలు, వీధినాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ప్రతి పౌర్ణమి రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి,



ఎత్తైన కొండపై ఆకాశదీపాన్ని వెలిగించడం ఇక్కడి మరో ప్రత్యేకత. ప్రతి సోమవారం ప్రత్యేక పూజా కైంకర్యాలతోపాటు నిత్యదీపారాధన జరుగుతుంది. ఈ కార్యక్రమాలు ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి తిరుమలరెడ్డి, సహాయ కార్యదర్శి మనోహర్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించడం విశేషం

కోనకు చేరుకొనే మార్గం

పుత్తూరు మండలం నేసనూరు పంచాయతీ, కళ్యాణవెంకటేశ్వర పురం గ్రామ అటవీప్రాంతంలో మూలకోన ఉంది. పుత్తూరు నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని మూలకోన వరకు మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 5 గంటల నుంచి స్థానిక గేట్‌పుత్తూరు క్యాబిన్ నుంచి ఆర్టీసీ బస్సులు బయల్దేరుతాయి. 27వ తేదీ వరకు బస్సుల రాకపోకలు కొనసాగుతాయి. కోన వరకు కార్లు, ట్రాక్టర్లు, బస్సులు వెళ్లేందుకు రోడ్డు అనువుగా ఉంది.


కొండరాళ్ల మధ్య సెలయేరు


కోనేరు మండపంలో శివలింగం


కొండపై పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయం

పూర్వజన్మ సుకృతం



పెద్దతీర్థం కోనలో వెలసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీసంఘమేశ్వర స్వామి దేవస్థానానికి స్వామి అమ్మవార్ల పంచలోహ ఉత్సవ విగ్రహాలను అందజేయడం కె.దొరస్వామిరెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, మా కుటుంబీకుల పూర్వజన్మ సుకృతం. ఇక్కడ నెలకొని ఉన్న మహిమాన్విత స్వామి అమ్మవార్లను ప్రతి ఒక్కరూ దర్శించి పునీతులవ్వాలి. - కె.వెంకటేశులురెడ్డి, చౌటూరు గ్రామం, పుత్తూరు

అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి



సహజ సిద్ధ మూలకోనలో వెలసియున్న శ్రీపార్వతీ సమేత శ్రీసంఘమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం బస్సు సౌకర్యాలు ఉన్నాయి. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవానికి తగిన ఏర్పాట్లు చేశాం. అన్నదానం, పండరి భజనలు, కోలాటం, భక్తమార్కండేయ నాటకం, తెప్పోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.
- కె.భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు, మూలకోన, చౌటూరుగ్రామం, పుత్తూరు మండలం.

ఉత్సవ విగ్రహాల బహూకరణ


విగ్రహాలను అందిస్తున్న దాతలు గిరిబాబు, మునికాంత

వెదురుకుప్పం: బ్రాహ్మణపల్లె సమీపంలో సిద్దేశ్వర కొండపై ఉన్న శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయానికి దాతలు పంచలోహంతో తయారు చేయించిన ఉత్సవ విగ్రహాలను బహూకరించినట్లు ఆలయ ధర్మకర్త చాణక్యప్రతాప్ సోమవారం తెలిపారు. మండలంలోని కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన టీటీడీ ఉద్యోగి పోలంపల్లి గిరిబాబు, మునికాంత దంపతుల కుమార్తె తేజశ్విని, కుమారుడు పూర్ణచందు, గిరిబాబు తల్లి ఈశ్వరమ్మ కలిసి రూ.1.50 లక్షలు వెచ్చించి పంచలోహంతో తయారు చేయించిన రెండు అడుగుల శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను సోమ వారం అందజేసినట్లు పేర్కొన్నారు. చిగురువాడ గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి ప్రియాంక, తేజస్‌కుమార్ వారి కుటుంబ సభ్యులు కలిసి నక్షత్ర హారతి, కుంభ హారతి దీపాలను ఆలయానికి అందించినట్లు పేర్కొన్నారు. ఆలయానికి తమవంతు రూ. 1.50 లక్షల విలువ చేసే విగ్రహాలను తయారు చేసి అందించడం అభినందనీయమన్నారు. దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. యువత రోహిత్‌కుమార్, నాగార్జున చూడామణి, శివకుమార్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం : ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మ్యుటేషన్ 06, శ్మశానానికి దారి 01, భూసర్వే 02, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 01, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 02, తమ భూమికి హద్దులను చూపించాలని 03, కోండరాజపురం ఎస్టీ కాలనీ వాసులకు పంట పొలాలకు దారి సౌకర్యం కల్పించాలని వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంస


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రశంసిస్తున్న ఉపాధ్యాయులు

నగరి: మండలంలోని ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17, అండర్-11, అండర్-9 విభాగాల్లో ప్రతిభ కనబరిచి కప్పు, సర్టిఫికెట్లు అందజేశారు. సోమవారం పాఠశాలలో అండర్-17 బాలికల విభాగంలో 2వ బహుమతి సాధించిన ఎం.నవ్యశ్రీ, అండర్-11 బాలికల విభాగంలో 5వ బహుమతిని సాధించిన ఎస్.దీప, అండర్-9 బాలుర విభాగంలో 4వ బహుమతిని సాధించిన ఎస్.తిరుమలను వీరితో పాటు కన్సొలేషన్ బహుమతులు అందుకున్న రూపకేశవ, అబుబాకర్ సిద్దిఖ్, లీలాప్రసాద్, జగన్‌లకు ప్రశంసలు అందించారు. హెడ్‌మాస్టర్ మురళీకృష్ణ, కోచ్ ఆనంద మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం


నంది వాహనాన్ని వితరణ చేస్తున్న దాతలు


ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని చింతపెంట పంచాయతీ రామాపురంలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో గోపూజ, గంగపూజ చేపట్టారు. అలాగే మహాగణపతి పూజ, గణపతిహోమ పూజలను ఉదయం 11 గంటలకు సంప్రదాయబద్ధంగా వేద పండితులు వేద మంత్రాల నడుమ జరిపించారు.

నంది వాహనం వితరణ

పెనుమూరులో వెలసిన కమలాంబికదేవి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామికి మునిరత్నం ఆచారి జ్ఞాపకార్థం ఆయన సతీమణి రాజేశ్వరి, కుమారులు శివప్రసాద్ ఆచారి, వరదాచారి, తులసీరామ్‌ఆచారి రూ.70 వేలు విలువ జేసే నంది వాహనాన్ని ఆలయానికి వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

నగరి: బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కార్పొరేషన్ రుణాలకు మండల పరిధిలో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులు మంగళవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఎంపీడీఓ కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నగరిలోని ఇండియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, సప్తగిరి బ్యాంకు, యూనియన్ బ్యాంకు, స్టేట్‌బ్యాంకులతో పాటు, ఏకాంబరకుప్పం ఇండియన్ బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. దరఖాస్తుదారులు తమ వెంట ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో తదితర ఒరిజినల్ డాక్యుమెంట్స్, ఆన్‌లైన్ అప్లికేషన్ రెండు జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు.

27న మున్సిపాలిటీలో..

నగరి: బీసీ, ఈబీసీ, కాపు, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 27వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నాగలాపురం రోడ్డులోని మెప్మా కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

సర్పంచ్‌పై దుర్భాషలు

శ్రీరంగరాజపురం: ఓ సర్పంచ్‌కు టీడీపీ నాయకుడు ఫోన్ చేసి దుర్భాషలాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మండలంలోని పెద్దకాలువ సర్పంచ్ ఏకాంబరం గ్రామాల్లో శని, ఆదివారం రోడ్లకు ఇరువైపులా పారిశుద్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఎల్లమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జయచంద్ర సర్పంచ్ ఏకాంబరానికి ఫోన్ చేసి తన పొలం పక్కన శుభ్రం చేయడంపై రాయలేని భాషలో బూతులు తిట్టాడు. ఈ సంఘటనపై పెద్ద కాలువ సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అరుణగిరి దేదీప్యమానం


విద్యుద్దీపాలతో శోభిల్లుతున్న అరుణగిరి క్షేత్రం

వెదురుకుప్పం: డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి మహోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ప్రతి సోమవారం ప్రత్యేకంగా నిర్వహించే అభిషేక పూజలు, ప్రదోషకాల పూజలతోపాటు నిత్య పూజలందుకుంటున్న శివపార్వతుల నిలయమైన అరుణగిరి క్షేత్రం విద్యుద్దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఏటా ఇక్కడ శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతోంది. ఈ ఏడాది సైతం ఆలయంలో వైభవంగా పూజలు నిర్వహించేందుకు ఇప్పటికే అరుణగిరి క్షేత్రాన్ని విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. మలుపుల వద్ద స్వామి వారి కటౌట్లు మిరుమిట్లు గొలిపేలా కాంతులీనుతున్నాయి. 26న బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రదోషకాల పూజలు ఉంటాయిని నిర్వాహకులు తెలిపారు. శివ లింగోద్భవం, మహా రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తుల శివనామస్మరణతో అరుణగిరి మార్మోగనుంది. చవటగుంటలో మీనాక్షి సమేత నందీశ్వరాలయం, బ్రాహ్మణపల్లె సమీపంలో ఉన్న సిద్దేశ్వరాలయం, ముతాలంలో ఉన్న సిద్దేశ్వర ఆలయాల్లో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రైవేటు పెత్తనం వద్దు


మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన

నగరి: మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల అప్పగింత నిర్వహణ సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని ప్రైవేట్ కంపెనీ, ఏజెన్సీలకు అప్పజెప్పొద్దని నగరి మున్సిపల్ వర్కర్స్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మిక యూనియన్ వారు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు కోదండయ్య మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ పారిశుద్య ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మూడు డీఏలు సత్వరం విడుదల చేయాలని కోరారు. పని చేస్తూ 14 మంది కార్మికులు మరణించారని, ఆ కార్మిక కుటుంబాలకు రావాల్సిన పీఎఫ్ డబ్బులు, పెన్షన్లు ఇంతవరకు చేరలేదన్నారు. ఈఎస్ఐ డబ్బులు వసూలు చేసినప్పటికీ కార్మికులకు ఈఎస్ఐ కార్డు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురళి, మున్సిపల్ యూనియన్ నాయకులు శేఖర్, నాగరాజు, సతీష్, చిన్న రాసు, సుబ్రహ్మణ్యం, రవి, రమేష్, హనుమంతు, కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర


సచివాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

విజయపురం: మండలంలోని పన్నూరు సచివాలయాన్ని స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం ఉపాధ్యాయులతో పాటు సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాలంటే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకు విజ్ఞాన యాత్రలు, క్రీడలు దోహదపడతాయని పన్నూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మనోజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరమేశ్వరి, నరసింహులు, జబీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్యాక్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందిస్తున్న ప్యాక్స్ సంఘ సభ్యులు

నగరి: చిత్తూరు జిల్లా ప్యాక్స్ (ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం) ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘం వారు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.తులసిపిళ్లై, అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి.రమేష్ మాట్లాడుతూ సంఘ ఉద్యోగుల సమావేశాలు నిర్వహించడానికి భవనవసతి లేనందున ప్రభుత్వ భూమిని 5 సెంట్లు కేటాయించాలని కోరారు. ఆగస్టు 2023న హెచ్‌ఆర్ పాలసీ అమలు చేసిందని, ఇంతవరకు డీఏ శాతం ఇవ్వలేదన్నారు. పదవీ విరమణ చేసిన సంఘ ఉద్యోగులకు 10 లక్షల గ్రాట్యుటీని ఇప్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ ఉపాధ్యక్షుడు దిలీప్, రాష్ట్ర నాయకులు మునస్వామి, హరి, శివారెడ్డి,రవి, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.